ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



తమిళనాడు
TAMILNADU

మంగళవారం 12 ఆగస్టు 2025

డెల్టా జిల్లాల్లో భారీ వర్షం

చెన్నై, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం, మైలాడుదురై, కడలూరు తదితర డెల్టా జిల్లాల్లో ఆదివారం అర్ధరాత్రి నుండి సోమవారం వేకువజాము వరకూ భారీగా వర్షాలు కురవటంతో జనజీవనం స్తంభించింది. సోమవారం ఉదయం విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రధాన రహదారుల్లో మోకాలి లోతు నీరు ప్రవహించడంతో పాదచారులు అవస్థలు పడ్డారు. తంజావూరు జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం వరకు ఎండ ఆ తర్వాత సన్నని తుంపర్లతో ప్రారంభమైన వర్షం క్రమంగా అధికమై కుండపోతగా మారింది. దీంతో తంజావూరు నగరంలో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. తంజావూరు, పాపనాశం, వల్లమ్, కురుంకుళం, తిరువయ్యారు, తిరువిడైమరుదూరు, అయ్యంపేట్టై, కుంభకోణం, పట్టుకోట తదితర ప్రాంతాల్లోనూ చెదురుముదురుగా వర్షాలు కురిశాయి.



తిరువయ్యారులో కురుస్తున్న వర్షం

బంగాళాఖాతంలో అల్పపీడనం

వాతావరణ పరిశోధన కేంద్రం

పెరంబూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వాయువ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఈ నెల 13న అల్పపీడనం ఏర్పడే అవకాశముందని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. ఈ విషయమై వాతావరణ కేంద్రం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... ఉత్తరాంధ్ర, పరిసర ప్రాంతాల్లో వాతావరణ ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, 13న వాయువ్య, దానిని అనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని తెలిపింది. ఉపరితల ఆవర్తనం కారణంగా రానున్న 48 గంటల్లో ఉత్తర, దక్షిణ తమిళనాడులోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని తెలిపింది. అదే సమయంలో, తిరువళ్లూర్, రాణిపేట, వేలూరు, తిరుపత్తూర్, నీలగిరి జిల్లాల్లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాముందని, రాజధాని నగరం చెన్నైలో ఆకాశం మేఘావృతంగా ఉంటూ కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని తెలిపింది. నైరుతి , ఉత్తర బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలు, అండమాన్ తీరం, పశ్చిమ-మధ్య అరేబియా సముద్రంలోని పలు ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో పెనుగాలులు వీచే అవకాశముందని, అందువల్ల మంగళవారం నుంచి ఈనెల 15వ తేది వరకు జాలర్లు ఆ ప్రాంతాలకు వెళ్లరాదని వాతావరణ కేంద్రం సూచించింది.

మీ గురించి మాకు తెలియదా?

- స్టాలిన్‌పై ఈపీఎస్ ధ్వజం
- రాష్ట్రాభివృద్ధే తమ లక్ష్యమని ప్రకటన
- వేపనహల్లిలో రోడ్ షో

ప్యారీస్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చి, వాటిని అమలు చేయకుండా ప్రజల్ని మభ్యపెడుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్ గురించి తమకు బాగా తెలుసని అన్నాడీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఎద్దేవా చేశారు. డీఎంకే పాలనలో అన్ని రంగాల్లో కుంటుపడిన రాష్ట్రాన్ని అభివృద్ధి పరచడమే తమ లక్ష్యమని ప్రకటించారు. 2026 అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని 'మక్కలై కాప్పోం...తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంతో ఈపీఎస్ చేపట్టిన రెండో విడత ప్రచారంలో భాగంగా సోమవారం కృష్ణగిరి జిల్లా వేపనహల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో సాగింది. రాయకోట అన్నా విగ్రహం జంక్షన్‌లో నిర్వహించిన రోడ్ షోలో మాజీ మంత్రులు బాలచంద్రారెడ్డి, కేపీ మునుస్వామితో కలసి రోడ్ షోలో పాల్గొన్న ఈపీఎస్ మాట్లాడుతూ... డీఎంకే ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించిందని, మామిడి పండ్ల దిగుబడిలో కృష్ణగిరి జిల్లా దేశంలోనే అగ్రస్థానంలో ఉందని అయితే, అధిక దిగుబడుల కారణంగా నష్టపోయిన రైతుల నుంచి మామిడి కొనుగోలు చేయకుండా ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. అలాగే, రబ్బరు రైతులకు గిట్టుబాటు ధర కల్పించలేదని, ఈ రెండు డిమాండ్లతో ఇటీవల జిల్లాలో అన్నాడీఎంకే భారీస్థాయిలో ఆందోళన నిర్వహించినట్లు ఈపీఎస్ తెలిపారు. హోసూరులో అంతర్జాతీయ ప్రమాణాలతో రూ.20 కోట్లతో అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో నిర్మించిన వేలం కేంద్రాన్ని డీఎంకే ప్రభుత్వం మూసివేసిందని, తాము వచ్చే ఏడాది మళ్లీ అధికారంలోకి వచ్చాక ఈ కేంద్రం ప్రారంభిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ముఖ్యంగా నీటి వనరుల్లో పూడికతీత జరపడం లేదని, సీనియర్ సిటిజన్ల పింఛన్‌ను పెంచలేదని, మహిళలకు అమ్మా స్కూటర్ల పథకాన్ని నిలిపివేసిందని ఈపీఎస్ ఆరోపించారు. ఈ నెల 23న చెన్నై శివారు ప్రాంతం షోలింగనల్లూర్, తిరుపోరూర్ నియోజకవర్గాల్లో నిర్వహించదలచిన తన మూడవ విడత పర్యటన మరో తేదీకి వాయిదావేస్తున్నట్లు ఈపీఎస్ మీడియాకు తెలిపారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న మాజీ సీఎం ఎడప్పాడి పళనిస్వామి



వేలంపాళయం వద్ద నిర్మించిన ప్రభుత్వాస్పత్రిని ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్

నేను మాటల మనిషిని కాదు !

- అన్నాడీఎంకే ఓటమి పడమటి జోన్ నుంచే ఆరంభం
- ఉడుమలపేట సభలో స్టాలిన్ ధ్వజం

చెన్నై, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల అన్నాడీఎంకే పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధఃపాతాళానికి చేరిందని, గత నాలుగేళ్ల డీఎంకే ద్రావిడ తరహా పాలనలో రాష్ట్ర ఆర్థిక ప్రగతి పురోగమించినట్లు కేంద్రప్రభుత్వమే ప్రకటించిందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. అయితే వాస్తవాలకు విరుద్ధంగా డీఎంకే పాలనలో అభివృద్ధి శూన్యమంటూ ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) అసత్య ప్రచారం చేస్తున్నారని, ఆయనలా తాను మాటల మనిషిని కాదని, చేతల మనిషినని సీఎం పేర్కొన్నారు.

తిరుప్పూరు జిల్లా ఉడుమలపేట నేతాజీ మైదానంలో సోమవారం జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో రూ. 1426.89 కోట్లతో పూర్తయిన పథకాలను సీఎం ప్రారంభించారు. 35 కొత్త పథకాలకు శంకుస్థాపన చేశారు.

తిరుప్పూరుకు వరాల జల్లు..

తిరుప్పూరు జిల్లాకు ముఖ్యమంత్రి స్టాలిన్ నాలుగు వరాలను ప్రకటించారు. కేరళ ప్రభుత్వంతో చర్చించి నీరారు - నల్లారు, ఆనైమలైయారు అనుసంధాన పథకాన్ని వీలైనంత త్వరగా అమలు చేస్తామన్నారు. పరంబికుళం ఆళియారు సాగు పథకం కాలువల్లో పూడికతీత పనులకు రూ.10 కోట్ల మేరకు నిధులు కేటాయించనున్నామని తెలిపారు. తిరుచ్చి కార్పొరేషన్‌లో రూ.9కోట్లతో గ్రంథాలయం, అమర జ్యోతి గార్డెన్ ప్రాంతం వద్ద రూ.5 కోట్లతో క్రీడామైదానం నిర్మిస్తామని, కాంగేయం నగర పంచాయతీలో రూ.11కోట్లతో తాగునీటి పథకాలు అమలు చేస్తామని, నంజియంపాళయం వద్ద ఉప్పారుపై రూ.7.60 కోట్లతో చెక్‌డ్యామ్ నిర్మించనున్నామని, ఊత్తుకుళి యూనియన్ ప్రాంతంలో రూ.6.5 కోటతో వెన్న కర్మాగారం నెలకొల్పుతామని పేర్కొన్నారు. ఉడుమలపేటలోని తాజ్‌థియేటర్ సమీపంలో రహదారికి మాజీ మంత్రి సాదిక్‌బాషా పేరు పెట్టనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ముత్తుసామి, ఎంపీ సామినాథన్, చక్రపాణి, కయల్‌విళి సెల్వరాజ్, జిల్లా కలెక్టర్ మనీష్ నారాణవరే, మేయర్ దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివిధ సంక్షేమ పథకాల కింద 19,785 మంది లబ్ధిదారులకు రూ.295.29 కోట్ల విలువైన సహాయాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పార్టీల కంటే ముందుగా ఈపీఎస్ ఇక్కడి పడమటి జోన్ నుండి ప్రచార పర్యటనను ప్రారంభించారని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ జోన్ నుండే అన్నాడీఎంకే ఓటమి ప్రారంభమవుతుందని తెలియకపోవడం శోచనీయమన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో, ఉప ఎన్నికల్లో అన్నాడీఎంకే చిత్తుగా ఓడిపోయిందని, వాస్తవాలు ఇలా ఉండగా తాను పడమటి జోన్‌కు చెందిన వ్యక్తినని, రైతుబిడ్డనని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రమంతటా ఉంగలుడన్ స్టాలిన్, నలమ్‌కాక్కుం స్టాలిన్ పథకాలకు లభిస్తున్న ప్రజా స్పందనను చూసి ఓర్వలేకే ఈపీఎస్ తనను ఏకవచనంతో విమర్శించే స్థాయికి దిగజారి పోయారన్నారు. ఉంగలుడన్ స్టాలిన్ పథకంపై హైకోర్టులో పిటిషన్ వేసి అభాసుపాలై , కోర్టు రూ.10లక్షల జరిమానా విధించినా ఈపీఎస్ మళ్ళీ అదే పనిగా ప్రభుత్వ పథకాలపై పసలేని విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈపీఎస్ తనను ఎంజీఆర్‌లా, జయలలితలా ఊహించుకుని ప్రచారంలో ఆ నేతలలాగే హావభావాలను ప్రదర్శించి చూపరులకు ఏవగింపు కలిగిస్తున్నారని స్టాలిన్ విమర్శించారు. వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే పత్తా లేకుండా పోవటం తథ్యమని స్టాలిన్ పేర్కొన్నారు.

జయ నా రోల్ మోడల్

- డీఎండీకే అధినేత్రి ప్రేమలత



ప్యారీస్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): 'సినీ, రాజకీయ రంగాల్లో రికార్డులు సాధించిన దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత తన రోల్ మోడల్' అని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత పేర్కొన్నారు. జీసీసీ ప్రధాన కార్యాలయం రిప్పన్ భవనం సమీపంలో తమ హక్కుల కోసం సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులకు మద్దతు ప్రకటించిన ప్రేమలత, సోమవారం వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ... 2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో డీఎంకే మేనిఫేస్టోలో ఉన్న హామీల్లో జీసీసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామన్న హామీ కూడా ఉందని, అయితే అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు దాటినా ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేనందువల్లే సుమారు 2 వేల మందికి పైగా కార్మికులు ఆందోళన చేస్తున్నారని, అయినా మేయర్ ప్రియ, కార్పొరేషన్ అధికారులు, మంత్రులు వీరికి న్యాయం చేయకుండా నిర్లక్ష్యం చూపుతున్నారని ఆరోపించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలితలు వారికి వారే సాటి అని, వారిని ఎవ్వరితోను పోల్చలేమన్నారు. ఇదిలా ఉండగా, జయలలితతో ప్రేమలత ఉన్నట్లు డీఎండీకే కోశాధికారి ఎల్కే సుధీష్ విడుదల చేసిన ఫొటో రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపింది.

పూర్తి అధికారం పార్లమెంట్‌కే ఉంది

- ఈసీకి లేదు : స్పీకర్ అప్పావు



అడయార్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహారశైలిని అసెంబ్లీ స్పీకర్ అప్పావు తప్పుబట్టారు. పూర్తి అధికారం పార్లమెంట్‌కే ఉందని ఎన్నికల సంఘానికి లేదన్నారు. ఆయన సోమవారం తిరునెల్వేలిలో మీడియాతో మాట్లాడుతూ, ఒక వ్యక్తి ఆరోపణలు చేస్తే, అది అబద్ధమని నిరూపించకుండానే ఆ వ్యక్తిని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయడం తప్పన్నారు. ఇలాంటి చర్యలకు కేంద్ర ఎన్నికల సంఘం అండగా ఉండటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా విధానంలో ఐఐటీ వంటి పోటీ పరీక్షల్లో ఉన్నతశ్రేణి వర్గాలకు చెందిన విద్యార్థులు గురుకులాల్లో విద్యాభ్యాసం చేయడం వల్ల ఉన్నత చదువులకు వెళ్ళే పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు రూ.14 వేల కోట్ల రుణాలను రద్దు చేశారన్నారు. పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అదేసమయంలో త్రిభాషా విద్యా విధానానికి మన రాష్ట్రంలో చోటు లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానంలో ఒక విద్యార్థి 3, 5, 8 తరగతుల్లో ఉత్తీర్ణులైతేనే పై చదువులకు వెళ్ళే పరిస్థితి ఉంటుందని లేనిపక్షంలో కూలి పనులు వెళ్ళాల్సి ఉంటుందని స్పీకర్ అప్పావు అభిప్రాయపడ్డారు.

పంద్రాగస్టుకు పటిష్ఠ బందోబస్తు

- విమానాశ్రయాల్లో ఐదంచెల భద్రత

పెరంబూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.. ఇప్పటికే రాష్ట్రంలో వున్న అన్ని విమానాశ్రయాలకు ఐదెంచెల భద్రత ఏర్పాటు కాగా, సమస్యాత్మక ప్రాంతాలను పోలీసులు జల్లెడపడుతున్నారు. 'ఆపరేషన్ సిందూర్'తో తీవ్ర అవమానపాలైన పాకిస్తాన్ ప్రేరేపిత మూకలు అవాంఛనీయ ఘటనలకు పాల్పడవచ్చనే అనుమానంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, జనావాస ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాలు, షాపింగ్ మాల్స్ అన్నింటిపైనా పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. అదే విధంగా ఆలయాలు, మసీదులు, చర్చిల వద్ద కూడా పోలీసులు నిఘా వేసివుంచారు. అనుమానితుల్ని ఎక్కడికక్కడ ప్రశ్నిస్తున్న పోలీసులు.. ఏమాత్రం సందేహమొచ్చినా, వారిని అదుపులోకి తీసుకుంటున్నారు., విమానాశ్రయాల వద్ద సాధారణం కంటే గస్తీ మరింత పెంచారు. లగేజీ క్షుణ్ణంగా తనిఖీ చేసేందుకు డొమెస్టిక్ ప్రయాణీకులు గంటన్నర ముందుగా విమానాశ్రయాలకు చేరుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. విదేశీ ప్రయాణీకులైతే మూడున్నర గంటల ముందుగా వుండాలని సూచించారు. దీనికి తోడు అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడం, ఇటీవల కాలంలో శాంతిభద్రతలు కాస్త ఇబ్బందికరంగా మారడం వంటి పరిణామాల్లో రాష్ట్ర ప్రభుత్వం సైతం ఈ వ్యవహారాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఎలాంటి అవాంచనీయ ఘటనలకు తావు లేకుండా స్వాతంత్ర్యదినోత్సవం జరగాలని, ఇబ్బందికరమైన ఘటనల ద్వారా ప్రతిపక్షాల విమర్శలకు తావివ్వరాదని ప్రభుత్వం ఇప్పటికే పోలీసులను ఆదేశించింది. ఆ మేరకు పోలీసు శాఖ కూడా పటిష్ఠమైన చర్యలు చేపడుతోంది.



విమానాశ్రయం వద్ద సాయుధ బలగాలు

రాజధాని నగరంలో ఏసీ సీటీ బస్సుల పరుగులు

- జెండా ఊపి ప్రారంభించిన డిప్యూటీ సీఎం ఉదయనిధి

చెన్నై, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మహానగర రవాణా సంస్థ (ఎంటీసీ) నగరంలో ఏసీ ఎలక్ట్రిక్ సిటీ బస్సులను ప్రవేశపెట్టింది. పెరుంబాక్కం వద్ద సోమవారం ఉదయం 55 ఎలక్ట్రిక్ ఏసీ సీటీ బస్సులను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఎంటీసీ ఆధ్వర్యంలో రూ.49.56 కోట్లతో పునర్నిర్మించిన పెరుంబాక్కం విద్యుత్ బస్సుల డిపో కూడా ఆయన ప్రారంభించారు.. అదే విధంగా కొత్తగా కొనుగోలు చేసిన 80 లోఫ్లోర్ ఎలక్ట్రిక్ సిటీ బస్సులను కూడా జెండా ఊపి ప్రారంభించారు. నగరంలో కాలుష్య నియంత్రణలో భాగంగా ఎంటీసీ రూ.233 కోట్లతో కొత్తగా 55 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను కొనుగోలు చేసింది. ఈ ఎలక్ట్రిక్ బస్సుల్లో ఫుట్‌బోర్డును 400 మి.మీ.ఎత్తుకు పెంచి, 250 మి.మీల ఎత్తు తగ్గించేందుకు వీలుంది. ఈ సదుపాయం వల్ల దివ్యాంగులు, వృద్ధులు సులువుగా బస్సు ఎక్కగలుగుతారు. మహిళల భద్రతకు సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. ఈ బస్సుల్లో నెలరోజులపాటు ప్రయాణించడానికి రూ.2వేల నెలవారి పాస్ కూడా డిపోల్లో విక్రయించనున్నారు. కార్యక్రమంలో మంత్రి శివశంకర్, ఎమ్మెల్యేలు ఎస్.అరవింద్ రమేష్, ఏఎంవీ ప్రభాకర్ రాజా, రవాణా సంస్థ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సున్‌సోంగం ఐడక్ సిరు, మహానగర రవాణా సంస్థ ఎండీ డాక్టర్ డి ప్రభుశంకర్, కలెక్టర్ డి.స్నేహ, ఓహెచ్ఎం గ్లోబల్ మొబిలిటీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సీఈఓ సౌరబ్ చౌదరి, స్విచ్ మొబిలిటీ సంస్థ సీఈఓ, అశోక్‌లేలాండ్ సీఈఓ గణేష్ మణి తదితరులు పాల్గొన్నారు.



పెరుంబాక్కం వద్ద ఎలక్ట్రిక్ బస్సులను పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న ఉదయనిధి

ఎలక్ట్రిక్ ఏసీ బస్‌రూట్లు...

ఉపముఖ్యమంత్రి ప్రారంభించిన ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు ప్రధానంగా ఐదు రూట్లలో నడపనున్నారు.

వాటి వివరాలు..

రూట్ నెం.	బస్ రూట్	బస్సుల సంఖ్య
ఎంఏ2	చెన్నై ఎయిర్‌పోర్ట్- సిరుచేరి ఐటి పార్కు	15
95ఎక్స్	కిలాంబాక్కం బస్‌టెర్మినల్- తిరువాన్మియూరు	05
555ఎస్	కిలాంబాక్కం బస్‌టెర్మినల్- చోళింగనల్లూరు	05
19	టి.నగర్ - తిరుప్పోరూరు	05
102	బ్రాడ్వే - కిలాంబాక్కం	05
570/ 570ఎస్	కోయంబేడు-కిలాంబాక్కం / సిరుచేరి ఐటీపార్క్	20

సమాచార దర్శిని

నేడు ఇంజనీరింగ్ సీట్ల తుది కేటాయింపు

పెరంబూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వ విద్యాలయం పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో మూడో విడత కౌన్సెలింగ్ ఈ నెల 7న ప్రారంభం కాగా, 64,629 మంది విద్యార్థులకు తాత్కాలిక సీట్లు కేటాయించారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు తాత్కాలిక కేటాయింపు ఉత్తర్వులను విద్యార్థులు నిర్ధారించుకోవడంతో, మంగళవారం ఇంజనీరింగ్ కోర్సుల తుది కేటాయింపు జాబితా విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

బీఈ ఉప కౌన్సెలింగ్ దరఖాస్తుకు నేడే చివరి అవకాశం

పెరంబూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరం ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించనున్న ఉప కౌన్సెలింగ్ దరఖాస్తు స్వీకరణ మంగళవారంతో ముగియనుంది. ఇంజనీరింగ్ కోర్సుల అడ్మిషన్ల మూడు విడతలుగా చేపట్టారు. 2025-26వ సంవత్సరానికి జనరల్ విభాగంలో భర్తీకాని సీట్లకు నిర్వహించనున్న ఉప కౌన్సెలింగ్‌కు ప్లస్ టూ, వృత్తి వృత్తి పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు https://tneaonline.org, https://www.dte.tn.gov.in అనే వెబ్ సైట్‌లలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఉప కౌన్సెలింగ్ ఈ నెల 21 నుంచి ప్రారంభం కానుందని అధికారులు తెలిపారు.

అన్ రిజర్వుడ్ టిక్కెట్లు పొందడం సులభం

పెరంబూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అన్ రిజర్వుడ్ టిక్కెట్లు ప్రయాణికులు సులభంగా పొందేలా 'ఎంయూటీఎస్ అసిస్టెంట్' సదుపాయం త్వరలో పరిచయం చేయనున్నారు. ప్రయాణికులు, ఎంయూటీఎస్ అనే మొబైల్ యాప్‌లో 'అన్ రిజర్వుడ్ టికెట్ సిస్టమ్' అనే లింక్ క్లిక్ చేసి టిక్కెట్లు పొందవచ్చు. ఈ వసతితో టిక్కెట్ల కోసం గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు.

టమోటా కిలో రూ.60

పెరంబూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు మార్కెట్లో టమోటా కిలో రూ.60కి పెరిగింది. ఈ మార్కెట్‌కు రాష్ట్రంలో పలు జిల్లాలు, కర్ణాటక, ఆంధ్ర తదితర రాష్ట్రాల నుంచి టమోటా దిగుమతి అవుతోంది. కొద్ది నెలల క్రితం టమోటా ధర హఠాత్తుగా కిలో రూ.100కు పెరిగింది. అనంతరం దిగుమతులు పెరగడంతో ధరలు తగ్గాయి. రెండు రోజుల క్రితం కిలో రూ.40కి విక్రయమైన నేపథ్యంలో, సోమవారం రూ.20 పెరిగి రూ.60కి విక్రయమైంది. చిల్లర మార్కెట్లో కిలో రూ.70-రూ.80 వరకు పలికింది. ఊటీ సహా పలు కొండ ప్రాంతాల్లో వర్షాల కారణంగా దిగుమతులు తగ్గడంతో ధర పెరిగిందని వ్యాపారులు తెలిపారు.

1,149 బోగీలకు సీసీ కెమెరాల ఏర్పాటు

పెరంబూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): చెన్నై ప్రధాన కేంద్రంగా ఉన్న దక్షిణ రైల్వేలోని 1,149 రైలు బోగీలకు సీసీ కెమెరాలు ఏర్పాటుచేయనున్నట్లు అధికారులు తెలిపారు. రైళ్లలో జరుగుతున్న హింసాత్మక ఘటనలు, చైన్ స్నాచింగ్ తదితరాలు అడ్డుకోవడం, నేరాలకు పాల్పడేవారిని సత్వరం గుర్తించి అరెస్ట్ చేసేలా అన్ని రైలు బోగీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని రైల్వే బోర్డు నిర్ణయించింది. ఆ ప్రకారం, దేశవ్యాప్తంగా 70వేల రైలు బోగీలు, 15,000 రైలింజన్లలో ఆధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆ ప్రకారం, దక్షిణ రైల్వే పరిధిలోని 1,149 రైలు బోగీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుపనులు త్వరలో చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నాసాలై, అన్నా నగర్, గిండి పరిధిలో మంగళవారం ఉదయం 11 గంటలకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార శిబిరాలు జరుగనున్నాయి. అన్నాసాలై పరిధిలో చింతాద్రిపేట లాబాండ్ వీధిలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, అన్నా నగర్ పరిధిలో అన్నా నగర్ 11వ ప్రధాన రోడ్డు 5వ వీధిలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, గిండి పరిధిలో కేకే నగర్ ఉప విద్యుత్ కేంద్ర ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్, ఆయా ప్రాంతాలకు చెందిన వినియోగదారులు హాజరై విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

రహదారిని ప్రైవేటుపరం చేస్తారా...?

● పీఎంకే నేత అన్బుమణి

ప్యారీస్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజాధనంతో నిర్మించిన రహదారిని ప్రైవేటుపరం చేయడం సబబేనా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని పీఎంకే ప్రధాన కార్యదర్శి అన్బుమణి ప్రశ్నించారు. ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... దక్షిణ చెన్నై పరిధిలోని వండలూరు నుంచి తిరువళ్లూర్ జిల్లా మీంజూరు వరకు 60 కి.మీ బైపాస్ రోడ్డును ప్రైవేటు సంస్థకు అప్పగించాలనుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రహదారులను ప్రైవేటు పరం చేయడం వల్ల రాబోయే 25 సంవత్సరాలకు ఆ సంస్థలు వాహనాల నుంచి పన్నుల రూపంలో పెద్ద మొత్తంలో నగదు వసూలుచేసే అవకాశముందన్నారు. చెన్నై మీదుగా ఇతర నగరాలకు వాహనాలు వెళ్లేలా వండలూరు నుంచి నెమిలిచేరి మీదుగా మీంజూరు వరకు రూ.2156.40 కోట్లతో నిర్మించిన రహదారిని రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఉపయోగించుకోవాలని అన్బుమణి తన ప్రకటనలో కోరారు.

● ఆడి కృత్తిక ఎఫెక్ట్

పెరిగిన పూల ధరలు

తిరుత్తణి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆడికృత్తికను పురస్కరించుకుని తిరుత్తణి మురుగన్ ఆలయంలో పూల ధరలు భారీగా పెరిగాయి. ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా తిరుత్తణి క్షేత్రానికి రకరకాల కావళ్లతో వచ్చే భక్తులు కావళ్లను అలంకరించి స్వామివారిని స్మరిస్తూ ఆలయానికి పాదయాత్రగా వెళ్తుంటారు. వర్షాల కారణంగా తిరుత్తణి పూలమార్కెట్‌కు పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి వస్తున్న పూల దిగుమతి తగ్గి ధరలు పెరిగాయి. ఈ నేపథ్యంలో, శుక్రవారం ఆడికృత్తిక కారణంగా పూల ధరలు రెండింతలు పెరిగాయి. దీంతో పూలమాలలు ధర ఒక్కసారిగా పెరగడంతో భక్తులు నిరాశ చెందుతున్నారు. దీనిపై ఆలయ నిర్వాహకులు చొరవ తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ప్రాణ సంకటంగా మారిన సెల్ఫీమోజు

● ఏనుగు దాడిలో పర్యాటకుడికి గాయాలు

చెన్నై, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ముదుమలై వద్ద ఓ అడవి ఏనుగుతో సెల్ఫీ తీసుకునేందుకు ప్రయత్నించిన పర్యాటకుడిపై ఆ ఏనుగు దాడి చేయటంతో గాయపడ్డాడు. ముదుమలై బందిపూర్ పులుల అభయారణ్యం ఉన్న జాతీయ రహదారిలో ఆదివారం సాయంత్రం ఓ ఏనుగు సంచరించింది. ఆ ఏనుగును గమనించిన వాహనచోదకులు తమ వాహనాలను అక్కడికక్కడే ఆపివేశారు. ఆ ఏనుగు క్యారెట్ లోడుతో ఉన్న లారీ దగ్గరకు వెళ్లి క్యారెట ఆరగించి రహదారి పక్కగా నిలిచింది. ఆ సమయంలో అటువైపు వచ్చిన ఓ పర్యాటకుడు ఆ ఏనుగుతో సెల్ఫీ తీసుకునేందుకు దాని దగ్గరకు వెళ్ళాడు. గమనించిన ఆ ఏనుగు ఘీంకరిస్తూ అతడిని తరిమింది. దీనితో భీతిల్లిన అతడు పరుగు లంఘించుకుని కిందపడ్డాడు. ఏనుగు కాలితో అతడిపై దాడి చేసి అడవిలోకి వెళ్లింది. ఆ తర్వాత వాహన చోదకులు అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆ పర్యాటకుడిని అడవి ఏనుగు తరుముతున్న దృశ్యాల వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



పర్యాటకుడిని తరుముతున్న ఏనుగు

పర్వతమలై వరదల్లో ఇద్దరు గల్లంతు

● మహిళ మృతదేహం లభ్యం

చెన్నై, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లా కలశపాక్కం సమీపంలోని పర్వతమలై వరదల్లో కొట్టుకుపోయిన తిరువేర్కాడుకు చెందిన మహిళ రెండు రోజుల తర్వాత శవంగా తేలింది. పర్వతమలై మల్లికార్జునేశ్వరాలయం 4560 అడుగుల ఎత్తైన పర్వతంపై ఉంది. ఆ ఆలయానికి ప్రతి పౌర్ణమి రోజున భక్తులు వస్తుంటారు. ఆ మేరకు చెన్నై వడపళనికి చెందిన తంగతమిళ్‌సెల్వి (36), తిరువేర్కాడుకు చెందిన ఇందిర (58) సహా 15 మంది పర్వతమలై బయలుదేరి వెళ్ళారు. పర్వతంపైకి వెళ్ళి శైవ దర్శనం అనంతరం ఆదివారం సాయంత్రం కొండదిగి వస్తుండగా కుండపోతగా వర్షం కురిసింది. పర్వతం దిగువన పచ్చయమ్మన్ గుడి నుంచి వీరభద్రస్వామి గుడికి వెళ్లే మార్గంలోని కాల్వలో వర్షపునీరు వరదలా ప్రవహించింది. ఈ ప్రవాహాన్ని దాటేందుకు 15 మంది భక్తులు ప్రయత్నించారు ఆ సమయంలో తంగతమిళ్‌సెల్వి, ఇందిర నీటి ఉధృతి పెరగటంతో వరదలో కొట్టుకుపోయారు. వెంటనే వారితో వచ్చినవారు పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి ఫిర్యాదు చేశారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి వెళ్ళి గాలింపు చర్యలు చేపట్టి వరదనీటిలో కొట్టుకుపోతున్న ఇందిర మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. తంగతమిల్‌సెల్వి ఆచూకీ కోసం తీవ్రంగా గాలించారు. సోమవారం ఉదయం కూడా అగ్నిమాపక సిబ్బంది ఆ వరదనీటిలో గాలింపు చర్యలు చేపట్టిన తంగతమిళ్‌సెల్వి జాడ కనుగొనలేకపోయారు. ఈ సంఘటన కారణంగా పర్వతమలైపైకి భక్తులు వెళ్లడానికి అధికారులు అనుమతి నిరాకరించారు.



ఇందిర (ఫైల్‌ఫొటో)

గిల్టు నగలతో రూ.3 కోట్ల మోసం

● బ్యాంకు మేనేజర్ సహా ముగ్గురి అరెస్టు

అడయార్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కంచే చేను మేసిన చందాన... బ్యాంకు మేనేజరే గిల్టు నగలతో రూ.3 కోట్ల మేర మోసానికి పాల్పడి, కటకటాలపాలైన ఘటన తిరువణ్ణామలై జిల్లాలో చోటుచేసుకుంది. వివరాలిలా వున్నాయి... తిరువణ్ణామలై జిల్లా గాంధీనగర్‌లో సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంకుండగా, ఇందులో మంగలం సమీపంలోని కరుమారిపట్టి గ్రామానికి చెందిన రామదాస్, అరట్టాపట్టు గ్రామానికి చెందిన ఏళుమలై అనే వారు గత యేడాది గిల్టు నగలు కుదువపెట్టి రుణం తీసుకున్నారు. వీరికి ఆ బ్యాంకు మేనేజర్, అప్రైజర్ చేతులు కలిపారు. వీరంతా కలిసి 20కిపైగా గిల్టు నగలను కుదువపెట్టి రూ.3 కోట్ల మేర మోసం చేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఈ బ్యాంకులో ఆడిటింగ్ జరిగింది. ఇందులో మొత్తం 22 మంది పేర్లతో నకిలీ నగలను కుదువపెట్టి రుణం తీసుకున్నట్టు తేలింది. దీంతో ఆడిటింగ్ అధికారులు బ్యాంకు మేనేజర్ విజయలక్ష్మి, ఎస్టిమేటర్ గోపినాథన్, బ్యాంకు సిబ్బందిపై నేర విభాగం పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ విచారణలో నకిలీ నగలను కుదువపెట్టి రుణం తీసుకున్నట్టు తేలడంతో మొత్తం ముగ్గురిని అరెస్టుచేయగా, మరో 20 మందిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

కార్పొరేషన్‌లో పారిశుధ్యం.. ప్రైవేటు పరం

● కౌంటర్ దాఖలుకు హైకోర్టు ఆదేశం

అడయార్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): చెన్నై నగర పాలక సంస్థ (కార్పొరేషన్)లో పారిశుధ్య పనులను ప్రైవేటు పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీన్ని విచారణకు స్వీకరించిన న్యాయస్థానం కౌంటర్ దాఖలు చేయాలని చెన్నై కార్పొరేషన్‌ను ఆదేశించింది. కార్పొరేషన్‌లోని 5, 6 జోన్ల పరిధిలోని పారిశుధ్య పనులను రూ.276 కోట్లకు ప్రైవేటుపరం చేసేలా జూన్ 16వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశారు. దీనిని వ్యతిరేకిస్తూ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ భవనమైన రిప్పన్ బిల్డింగ్ వద్ద పారిశుధ్య కార్మికులు నిరవధిక ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పారిశుధ్య పనులను ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఉళైప్పోర్ ఇయ్యక్కం అధ్యక్షుడు కు.భారతి మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీన్ని హైకోర్టు విచారణకు స్వీకరించి, కౌంటర్ దాఖలు చేయాలని కార్పొరేషన్‌కు నోటీసులు జారీచేసింది. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరుగనుంది.

తాంబరం కమిషనర్ కార్యాలయాన్ని ఖాళీ చేయండి

● మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు

పెరంబూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తాంబరం పోలీసు కమిషనర్ కార్యాలయాన్ని రెండేళ్లలో ఖాళీ చేయాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. తాంబరం పోలీసు కమిషనర్ కార్యాలయాన్ని ఖాళీ చేసి, భవనం తమకు అప్పగించాలని కోరుతూ భవన యజమానులు శరత్‌కుమార్, వెంకటేష్, చౌదరి తదితరులు మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. పిటిషన్‌లో... నెలకు రూ.10,14,300 అద్దె నిర్ణయించి, 2022 జనవరి నుంచి 11 నెలలు అద్దెకు సంబంధించిన అగ్రిమెంట్‌పై సంతకాలు చేశామన్నారు. నిర్ణీత అద్దె చెల్లించకుండా, ప్రజాపనుల శాఖ అసెస్‌మెంట్ ఆధారంగా రూ.6,08,438 అద్దెగా నిర్ణయించి, 2022 జనవరి నుంచి నవంబరు వరకు రూ.82,16,824ను చెక్కు రూపంలో అందించారని వివరించారు. నిర్ణయించిన అద్దెకన్నా తక్కువగా ఇవ్వడంతో, నెలకు రూ.4 లక్షల వరకు నష్టపోయామని, అద్దె కాలం పెంచేందుకు తాము నిరాకరించగా, ఎలాంటి ఒప్పందం లేకుండా భవనాన్ని వినియోగించడం చట్టవ్యతిరేకమని, అందువల్ల దానిని ఖాళీ చేసి భవనం తమకు అప్పగించేలా ఉత్తర్వులు జారీచేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ సోమవారం విచారించిన న్యాయమూర్తి ఆనంద్ వెంకటేశన్ వెలువరించిన తీర్పులో... భవనం అద్దె రూ.6 లక్షల నుంచి రూ.13 లక్షలకు పెంచుతున్నట్లు, అందుకు అదనపు అద్దెగా రూ.2.18 కోట్లు డిసెంబరు 31వ తేదిలోగా పిటిషనర్లకు ప్రభుత్వం చెల్లించాలని, రెండేళ్లలో పోలీసు కమిషన్ కార్యాలయం ఖాళీ చేయాలంటూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

గత ఏడాది ప్లస్ వన్ ఫైయిలైన విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు

పెరంబూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గత విద్యా సంవత్సరంలో ప్లస్ వన్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని విద్యార్థులు, ఈ ఏడాది పబ్లిక్ పరీక్షలకు హాజరుకావాలని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. 2017-18 విద్యా సంవత్సరం నుంచి ప్లస్ వన్‌లో కూడా టెన్త్, ప్లస్ టూకు నిర్వహిస్తున్నట్లు పబ్లిక్ పరీక్షలు తప్పనిసరి చేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో 8,07,098 మంది విద్యార్థులు ప్లస్ వన్ పబ్లిక్ పరీక్షలు రాయగా, వారిలో 7.43 లక్షల మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణులు కాని 63,866 మంది విద్యార్థులకు గత నెల 7 నుంచి 11వ తేది వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. తాజాగా ప్రభుత్వం రాష్ట్ర విద్యా ప్రణాళిక విడుదల చేయగా, అందులో టెన్త్, ప్లస్ టూ తరగతులకు మాత్రమే పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో గత సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని ప్లస్ వన్ విద్యార్థులు, వచ్చే ఏడాది పబ్లిక్ పరీక్షలు రాయాల్సి ఉంటుందని, 2025-26 విద్యా సంవత్సరం నుంచి ప్లస్ వన్ తరగతికి పబ్లిక్ పరీక్షలు ఉండవని విద్యాశాఖ తెలియజేసింది.

'అమృత్ భారత్' కింద నాలుగు రైల్వేస్టేషన్ల అభివృద్ధి

● దక్షిణ రైల్వే జీఎం ఆర్ఎన్ సింగ్


ప్యారీస్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): 'అమృత్ భారత్' పథకం కింద తిరువళ్లూర్ జిల్లాలోని తిరుత్తణి, తిరువళ్లూర్, గుమ్మిడిపూండి, అరక్కోణం రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు దక్షిణ రైల్వే జనరల్ మేనేజర్ ఆర్ఎన్ సింగ్ తెలిపారు. ఆయన చెన్నై డీఆర్ఎం శైలేంద్ర సింగ్‌తో కలసి సబర్బన్ విద్యుత్ రైళ్లు నడిపే మార్గాలను సోమవారం పరిశీలించారు. ఈ మార్గాల్లో భద్రతాంశాలు, సిబ్బంది, స్టేషన్ మాస్టర్ల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ఎన్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ... దక్షిణ రైల్వే పరిధిలో ఉన్న సెయింట్ థామస్ మౌంట్, సూళ్లూరుపేట సహా 13 రైల్వేస్టేషన్లు రూ.129.66 కోట్లతో విస్తరించి, గత నెల నుంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు అమృత్ భారత్ పథకం కింద తిరువళ్లూర్ జిల్లాలోని నాలుగు రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు 92 శాతం పూర్తయ్యాయని, వచ్చే జనవరి నాటికి ఇవి అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నాలుగు రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల విశ్రాంతి గది, ఎస్కలేటర్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, రైళ్ల రాకపోకలు తెలిపేలా డిజిటల్ బోర్డులు ఏర్పాటుచేస్తున్నట్లు ఆర్ఎన్ సింగ్ తెలిపారు.

మానవ హక్కుల కమిషన్ తీర్పును సమర్థించిన మద్రాసు హైకోర్టు

పెరంబూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సీపీఎం మాజీ ఎమ్మెల్యే డిల్లీ బాబుపై దాడిచేసిన కేసులో డీఎస్పీ రూ. లక్ష నష్ట పరిహారం ఇవ్వాలంటూ మానవ హక్కుల కమిషన్ ఉత్తర్వులను సమర్థిస్తూ మద్రాసు హైకోర్టు తీర్పు చెప్పింది. చెన్నై-సేలం ఎనిమిది లేన్ల రహదారి కోసం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేపట్టడాన్ని నిరసిస్తూ, 2018 జూన్ 26వ తేది సెంగం ప్రాంతంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఆందోళనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డిల్లీ బాబుపై పోలీసులు దాడిచేయడంతో పాటు అరెస్ట్ చేశారు. తనపై జరిగిన దాడి మానవ హక్కుల ఉల్లంఘన అంటూ మానవ హక్కుల కమిషన్‌లో డిల్లీ బాబు పిటిషన్ వేశారు. పిటిషన్ విచారించిన కమిషన్, సెంగం డీఎస్పీ సుందరమూర్తి, ఇద్దరు ఎస్ఐలు రూ. లక్ష పరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు. ఈ ఉత్తర్వులు వ్యతిరేకిస్తూ డీఎస్పీ సుందరమూర్తి మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసు న్యాయమూర్తి ఎం.సుందర్, న్యాయమూర్తి హేమంత చందన గౌడర్‌తో కూడిన ధర్మాసనం విచారించి, డీఎస్పీ పిటిషన్ తోసిపుచ్చుతూ, మానవ హక్కుల కమిషన్ ఉత్తర్వులు సమర్థించింది.

రేషన్‌షాపులో ఏనుగు బీభత్సం

చెన్నై, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా పుదూరు సమీపంలో ఉన్న రేషన్‌షాపులో సోమవారం వేకువజామున అడవి ఏను గు చొరబడి బియ్యం, పప్పుదినుసులను ఆరగించి షాపులో వస్తువులను చిందరవందర చేసి పారిపోయింది. సోమవారం ఉదయం ఆ ప్రాంతంలో వెళ్తున్న పాదచారులు రేషన్ దుకాణం షట్టర్ పగిలి ఉండటం, నేలపై బియ్యం, పప్పుదినుసులు పడి ఉండటం గమనించి రేషన్‌షాపు యజ మానికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అటవీ శాఖ అధికారులు కూడా ఆ ప్రాంతానికి వెళ్ళి విచారణ జరిపారు. అడవి ఏనుగు రాకుండా చర్యలు చేపడతామని అటవీ శాఖ అధికారులు హామీ ఇచ్చారు.



రేషన్‌షాపు ముందు నేలపై పారబోసిన బియ్యం

అత్తను హతమార్చి లొంగిపోయిన మహిళ

పెరంబూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై సమీపం వెట్టవలం గ్రామంలో పాతకక్షల కారణంగా అత్తను హతమార్చిన కోడలు పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయింది. ఆమె గొంతు కోసి హతమార్చినట్లు నిందితురాలు వాంగ్మూలం ఇచ్చింది. రాత్రి నిద్రలో ఉన్న అత్త అయ్యమ్మాళ్‌ను కోడలు దేవి హతమార్చిన ఘటన గ్రామంలో కలకలం రేపింది.

బాలికతో వివాహం యువకుడిపై పోక్సో కేసు

ప్యారీస్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మదురైలో పదిహేడేళ్ల బాలికను వివాహం చేసుకున్న 19 ఏళ్ల యువకుడిపై పోక్సో కేసు నమోదుచేసి విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. తండ్రి గత ఏడాది మరణించడంతో తల్లి సంరక్షణలో పెరుగుతున్న బాలిక 10వ తరగతి వరకు చదువుకుని ఓ దుకాణంలో పనిచేస్తోంది. ఆమెకు 19 ఏళ్ల యువకుడికి ఏర్పడిన పరిచయం వివాహం వరకు దారితీసింది. ఆదివారం బాలికను వివాహం చేసుకున్నాడనే సమాచారంతో పిల్లల సంరక్షణ విభాగం అధికారి ముత్తులక్ష్మి, మహిళా పోలీసు అధికారులు ఆ యువకుడిని విచారించి బాల్యవివాహం చేసుకున్నట్లు నిర్ధారించి అతనిపై పోక్సో కేసు నమోదుచేశారు.

టీవీకే మహానాడు నిర్వహణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు

చెన్నై, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మదురైలో ఈ నెల 21న జరుపతలపెట్టిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) ద్వితీయ మహానాడు ఏర్పాట్ల కోసం 20 ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ సోమవారం సాయంత్రం ప్రకటించారు. ఈ మహానాడుకు లక్షలాదిమంది వస్తారని తెలియటంతో వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేపట్టేందుకు ఈ కమిటీలను ఆయన ఏర్పాటు చేశారు. 506 ఎకరాల విస్తీర్ణంలో ఈ మహానాడును అట్టహాసంగా నిర్వహించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

కవి కంబచక్రవర్తికి స్మారక మండపం

● ఎంపీ జగద్రక్షగన్ డిమాండ్

చెన్నై, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తమిళ కవి కంబచక్రవర్తికి నగరంలో స్మారక మండపం నిర్మించాలని కంబన్ కళగం వ్యవస్థాపకుడు ఎంపీ జగద్రక్షగన్ డిమాండ్ చేశారు. ఇటీవలే కంబన్ కళగం 50వ వార్షికోత్సవాలు అట్టహాసంగా జరిగాయని, ఆ వేడుకల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ పాల్గొనటంతో సభకు నిండుదనం చేకూరిందని తెలిపారు. వాల్మీకి రామాయణాన్ని పామరుల నుండి పండితులదాకా సులువుగా అర్థమయ్యేరీతిలో వర్ణనాత్మకంగా తమిళంలో రచించిన కవి కంబ చక్రవర్తికి నగరంలో కీలకమైన ప్రాంతంలో స్మారక మండపం ఏర్పాటు చేయాలని సీఎం స్టాలిన్‌కు విజ్ఞప్తి చేశారు.

నీటమునిగి నలుగురు యువకులు మృతి

చెన్నై, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తిరువారూర్ జిల్లా నన్నిలం సమీపం కీళకుడి పుత్తారు నదిలో మునిగి నలుగురు యువకులు మృతిచెందారు. విల్లియనూరు ప్రాంతానికి చెందిన కొందరు యువకులు ఆ ప్రాంతానికి విహార యాత్రకు వచ్చారు. వారు నదిలో స్నానం చేస్తుండగా, నలుగురు యువకులు లోతైన ప్రాంతానికి వెళ్లి నీటమునిగారు. స్నేహితులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మృతదేహాలు వెలికితీసి పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

బీజేపీది నిరంకుశ పాలన : ఐయూఎంఎల్

ప్యారీస్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ నిరంకుశ పాలనతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) జాతీయ అధ్యక్షులు కేఎం ఖాదర్ మొహిదీన్ ఆరోపించారు. నాగపట్టణం జిల్లా నాగూర్‌లో ఆదివారం జరిగిన ఐయూఎంఎల్ రాష్ట్రస్థాయి సమావేశంలో ఆమోదించిన తీర్మానాల గురించి ఆయన మీడియాకు వివరించారు. కేంద్రంలో అధికారంలో కొనసాగుతున్న బీజేపీ ప్రభుత్వం, రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ నిరంకుశ పాలన సాగిస్తోందని దుయ్యబట్టారు. ఓట్ల జాబితాలో సంవత్సరానికి నాలుగు సార్లు మాత్రమే సవరించే అధికారం ఎన్నికల కమిషన్‌కు ఉందని, అయితే చట్టాన్ని పక్కన పెట్టి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పనులను ఈసీ బిహార్‌లో చేపట్టిందని ఆరోపించారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఓట్ల చోరీపై కేంద్ర ప్రభుత్వం, ఈసీని నిలదీసినా సమాధానం చెప్పలేక తడబడుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

ధనుష్కోటి రహదారిపై ఇసుక మేటలు

పెరంబూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం సమీపంలో తుఫాను కారణంగా దెబ్బతిన్న ధనుష్కోటి సముద్ర ప్రాంతం సహజంగానే తుఫానులు, ప్రవాహాలకు గురవుతోంది. ఈ ప్రాంతంలోని సముద్రం అల్లకల్లోలంగా ఉండడం, అప్పుడప్పుడు బలమైన తుఫాను గాలులు వీస్తుంటాయి. ఈ నేపథ్యంలో, కొద్దిరోజులుగా ధనుష్కోటి ప్రాంతంలో బలమైన గాలులు వీస్తున్నాయి. దీంతో ధనుష్కోటి ఎమ్మార్ నగర్ బీచ్ నుంచి అరిచ్చల్‌మునై ఉన్న జాతీయ రహదారిపై పలు ప్రాంతాల్లో ఇసుక మేటలు ఏర్పడ్డాయి. ధనుష్కోటికి పలు ప్రాంతాల నుంచి ప్రతిరోజు వాహనాల్లో పర్యాటకులు వెళుతుంటారు. ప్రస్తుతం వాహనాలు ఇసుక మేటలో చిక్కుకోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై ఉన్న ఇసుక మేటలను తొలగించాలని పర్యాటకులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



రోడ్డుపై పేరుకుపోయిన ఇసుక

అన్నాడీఎంకేను విమర్శించొద్దు

● డీపీఐ కార్యకర్తలకు తిరుమా సూచన

ప్యారీస్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే నేతలపై విమర్శలు చేయరాదని డీపీఐ కార్యకర్తలకు ఆ పార్టీ అధ్యక్షులు, ఎంపీ తిరుమావళవన్ సూచన చేశారు. రాష్ట్రంలో కొనసాగుతున్న పరువు హత్యలను అడ్డుకొనేలా ప్రత్యేక చట్టం తీసుకురావాలన్న డిమాండ్‌తో రాష్ట్రంలోని పలు జిల్లా కేంద్రాల్లో సోమవారం ధర్నా జరిగింది. నగరంలో జరిగిన ధర్నాలో పాల్గొన్న తిరుమావళవన్ మీడియాతో మాట్లాడుతూ... డీపీఐ ఆధ్వర్యంలో బహిరంగ సభలు, టీవీ ఛానళ్లలో మాట్లాడే ప్రచారకర్తలు, పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలు ఇకపై అన్నాడీఎంకేను విమర్శించవద్దని, ఇటీవల తిరుచ్చిలో జరిగిన సమావేశంలో నెరవేర్చిన 'లౌకిక వాదాన్ని కాపాడుదాం' అనే అంశంపై మాత్రమే మాట్లాడాలని తెలిపారు. దివంగత మాజీ ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలితల కీర్తిప్రతిష్ఠలకు భంగం కలిగించేలా తాను మాట్లాడినట్లు ప్రసారం చేస్తున్న కథనాల్లో వాస్తవం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరువు హత్యలు పూర్తిస్థాయిలో అడ్డుకొనేలా చట్టం ప్రవేశపెట్టాలని, అలాగే జాతీయస్థాయిలో కూడా కేంద్ర ప్రభుత్వం ఈ చట్టం తీసుకురావాలని తిరుమావళవన్ డిమాండ్ చేశారు.

రామేశ్వరం జాలర్ల నిరవధిక సమ్మె

● తీరానికే పరిమితమైన పడవలు

అడయార్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నావికాదళం అరెస్టు చేసిన తమిళ జాలర్లను తక్షణం విడిపించాలని డిమాండ్ చేస్తూ రామనాథపురం జిల్లా రామేశ్వరంలో జాలర్లు నిరవధిక సమ్మెకు దిగారు. ఈ కారణంగా దాదాపు 700 బోట్లు తీరంలోనే లంగరు వేశారు. పాక్ జలసంధి సమీపంలో చేపల వేటకు వెళ్ళే జాలర్లను శ్రీలంక నావికా దళం తరచుగా అరెస్టు చేస్తోంది. ఇటీవల ఏడుగురు జాలర్లను అరెస్టు చేయడంతో పాటు వారి సామగ్రిని కూడా స్వాధీనం చేసుకుంది. ఈ నేపథ్యంలో లంక నావికాదళం అరెస్టు చేసిన జాలర్లను విడిపించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని రామేశ్వరం జాలర్లు సోమవారం నిరవధిక సమ్మెకు దిగారు. ఈ కారణంగా ఆ ప్రాంతంలో చేపల వేట పూర్తిగా ఆగిపోయింది.

నేడు 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాలు

పెరంబూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం జరుగనున్న 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరం వివరాలను గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, అన్నానగర్ మండలం 100వ డివిజన్ పరిధిలోని టీపీ-సత్రం మెయిన్ రోడ్డు సమీపంలోని అన్నా కమ్యూనిటీ హాలు, తండయార్‌పేట మండలం 47వ డివిజన్ పరిధిలోని కొరుక్కుపేట ఏఈఎం స్కూల్ ప్రాంగణం, కోడంబాక్కం మండలం 136వ డివిజన్ పరిధిలోని సాలిగ్రామం వందడుగుల రోడ్డు సమీపంలోని కమ్యూనిటీ హాలు, రాయపురం మండలం 56వ డివిజన్ పరిధిలోని ప్రకాశం రోడ్డులోని హయ్యత్ మహల్, పెరుంగుడి మండలం 186వ డివిజన్ పరిధిలోని పుళుదివాక్కం సుమంగళి కల్యాణ మండపం మెయిన్ రోడ్డు, తిరువిక నగర్ 67వ డివిజన్ పరిధిలోని తిరువిక నగర్ కామరాజర్ కల్యాణ మండపం తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగనున్నాయి.

ఎంఎడ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యా కళాశాలల్లో 2025-26వ విద్యా సంవత్సరానికి ఎంఎడ్ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్నవారు ఈ నెల 20వ తేదిలోగా దరఖాస్తు చేయాలి. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్ విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలోని ఆరు విద్యా కళాశాలల్లో ఎంఎడ్ కోర్సులో 300 సీట్లున్నాయన్నారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు www.tngasa.in, http://www.tngasa.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం, 25న ర్యాంకుల జాబితా విడుదల చేసి, 26 నుంచి 29వ తేది వరకు అడ్మిషన్లు పూర్తిచేసి, సెప్టెంబరు 1 నుంచి తరగతులు ప్రారంభించనున్నట్లు మంత్రి చెళియన్ తెలిపారు.

తిరుమావళవన్ జన్మదిన వేడుకలకు కమల్

చెన్నై, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డీపీఐ అధ్యక్షుడు, లోక్‌సభసభ్యుడు తొల్ తిరుమావళవన్ జన్మదిన వేడుకలు ఈ నెల 16న నగరంలోని కామరాజర్ అరంగంలో జరిపేందుకు పార్టీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. 16 సాయంత్రం నాలుగ గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఈ వేడుకలు కొనసాగనున్నాయి. నాలుగు గంటలకు స్టీఫన్ రాయల్ బృందం సంగీత కచేరి, ఆరుగంటలకు కలైమామణి జాకీర్‌హుసేన్ బృందం నృత్య కార్యక్రమం, 7 గంటకు కవి సమ్మేళనం జరుగుతాయి. కవి సమ్మేళనాన్ని సినీ దర్శకుడు కె.భాగ్యరాజ్ ప్రారంభించనున్నారు. రాత్రి 11 గంటలకు తిరుమావళవన్‌కు ప్రముఖుల సత్కారం జరుగనుంది. ఈ కార్యక్రమంలో మక్కల్ నీదిమయ్యం అధ్యక్షుడు కమల్‌హాసన్ పాల్గొననున్నారు.

వీధి శునకాల నియంత్రణకు చర్యలు చేపట్టండి

● రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఉత్తర్వులు

పెరంబూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వీధి శునకాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. మదురై కేకే నగర్‌కు చెందిన శరవణన్ హైకోర్టు మదురై బెంచ్‌లో దాఖలుచేసిన పిటిషన్‌ను సోమవారం విచారించిన న్యాయస్థానం, వీధి శునకాలను నియంత్రించేలా కలెక్టర్లు సహా అన్ని విభాగ అధికారులకు ప్రధాన కార్యదర్శి సర్క్యులర్ పంపాలని ఉత్తర్వులు జారీచేశారు.

నవంబరు 1, 2 తేదీల్లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష

● దరఖాస్తు స్వీకరణ ప్రారంభం

పెరంబూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష నవంబరు 1,2 తేదీల్లో నిర్వహించనున్నట్లు, దీనికి దరఖాస్తు స్వీకరణ మంగళవారం నుంచి ప్రారంభమవుతుందని ఉపాధ్యాయ ఎంపిక బోర్డు (టీఆర్బీ) తెలిపింది. ఈ మేరకు టీఆర్బీ విడుదల చేసిన ప్రకటనలో... ఉపాధ్యాయుల ఎంపిక బోర్డు ఈ ఏడాది (2025) తమిళనాడు ఉపాధ్యాయుల అర్హత పరీక్ష (పేపర్-1, పేపర్-2)కు సంబంధించిన నోటిఫికేషన్ సోమవారం https://www.trb.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో విడుదల చేశామని తెలిపింది. విద్యార్హత, దరఖాస్తుకు సంబంధించిన వివరాలు నోటిఫికేషన్‌లో ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్ ద్వారా సోమవారం నుంచి సెప్టెంబరు 8వ తేది సాయంత్రం 5 గంటల్లోపు సమర్పించాలని టీఆర్బీ తెలిపింది.

ఆ ఆలోచనలు మహిళల్లోనే అధికం

● దర్శకురాలు దమయంతి



'కాయల్' ఆడియో రిలీజ్ దృశ్యం

కులద్వేషం, వేర్పాటువాదం వంటి అంశాలు పురుషుల్లోనే అధికంగా ఉంటాయన్న కోణంలో అనేక సినిమాలు ఇప్పటివరకు వచ్చాయని, నిజం చెప్పాలంటే ఇలాంటి ఆలోచనలన్నీ మహిళల్లోనే ఉంటాయని దర్శకురాలు దమయంతి అన్నారు. ఆమె దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం 'కాయల్'. జే స్టూడియో పతాకంపై జేసు సుందరరామన్ నిర్మించారు. లింగేష్, అనుమోల్, గాయత్రి, స్వాగత, రమేష్ తిలక్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఆడియో రిలీజ్ వేడుక నగరంలో ఆదివారం రాత్రి జరిగింది. ఇందులో పలువురు సినీ ప్రముఖులు పాల్గొని ఆడియో రిలీజ్ చేశారు. ఈ వేడుకలో చిత్ర దర్శకురాలు దమయంతి మాట్లాడుతూ, 'ఈ కథ నా జీవితంలో జరిగింది. పురుషుల్లోనే అధిపత్య ధోరణి ఉంటాయని భావిస్తారు. నిజానికి ఈ తరహా ఆలోచనలు మహిళల్లో ఎక్కువగా ఉంటాయి. వీటిని ఒక తరం నుంచి మరో తరానికి తీసుకెళ్ళడంలో మహిళలు పెద్ద పాత్ర పోషిస్తారు. నేను చెప్పిన కథ నమ్మి సినిమా తీసిన నిర్మాతకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు' తెలిపారు. నిర్మాత జేసు సుందరరామన్ మాట్లాడుతూ, 'నేను అమెరికాలో ఉంటాను. దర్శకురాలు స్క్రిప్టు పంపించారు. దాన్ని పూర్తిగా చదివిన తర్వాత సినిమా తీయాలన్న నిర్ణయానికి వచ్చాను. సినిమా తీయాలంటే కథ వినాల్సిన అవసరం లేదు. స్క్రిప్టు చదివినా సరిపోతుంది. ఇలాంటి మంచి కథలతో మరిన్ని సినిమాలు నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఈ చిత్రం తమిళంలో గొప్ప విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాను' అని పేర్కొన్నారు. హీరో లింగేష్ మాట్లాడుతూ, 'ఈ చిత్రం సమాజంలో పెద్ద మార్పుకు దారితీస్తుందని భావిస్తున్నాను. పైగా నా సినీ కెరీర్‌కు ఎంతో ముఖ్యం అన్నారు. ఆ తర్వాత హీరోయిన్లు, ఇతర సాంకేతిక బృందం అభిప్రాయాలను వెల్లడించారు.

'కాంత'తో తమిళంలోకి భాగ్యశ్రీ ఎంట్రీ



'కాంత'లో దుల్కర్ సల్మాన్ - భాగ్యశ్రీ బోర్సే

సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న 'కాంత' చిత్రంతో యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే కోలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు. వేఫేరర్ ఫిలిమ్స్ సహకారంతో స్పిరిట్ మీడియా నిర్మించిన ఈ చిత్రంలో సముద్రఖని ముఖ్య పాత్ర పోషించారు. మద్రాస్ మహానగరంలో 1950నాటి సంస్కృతి నేపథ్యంలో ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఈ ఎంట్రీ గురించి భాగ్యశ్రీ మాట్లాడుతూ, 'కాంత'తో తమిళ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడం చాలా సంతోషంగా ఉంది. ఇది నా సినీ కెరీర్‌కు అత్యంత ప్రత్యేకమైనది. దుల్కర్, సముద్రఖని వంటి సీనియర్ ఆర్టిస్టులతో కలిసి ఈ అందమైన కథకు ప్రాణం పోయడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో మేము ఎంతగానో ఎంజాయ్ చేశాం.. అదే అనుభూతిని ప్రేక్షకులు కూడా పొందుతారు. మున్ముందు కోలీవుడ్ ప్రేక్షకులు నన్ను ఆదరిస్తారని బలంగా నమ్ముతున్నాను' అని ఆమె పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

హీరో సూర్యపై క్రష్

● 'హౌస్‌మేట్స్' హీరోయిన్



అర్ష బైజు

హీరో సూర్యపై తనకు ప్రత్యేకమైన క్రష్ ఉందని 'హౌస్‌మేట్స్' హీరోయిన్ అర్ష బైజు అంటున్నారు. ఈ మలయాళ యువనటి చిత్రంతో తమిళంలోకి అడుగుపెట్టగా, పైగా హౌస్‌మేట్స్‌లో ఆమె నటనను సినీ విమర్శకులు సైతం మెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఆమె తన తొలి తమిళ సినీ అనుభవం గురించి మాట్లాడుతూ, 'మలయాళంలో అనేక చిత్రాల్లో నటించినప్పటికీ తమిళంలో హీరోయిన్‌గా నటించాలని ఆశపడ్డాను. అది 'హౌస్‌మేట్స్'తో నెరవేరింది. తమిళ ప్రజలు ప్రతిభకు విలువనిస్తారు. ఈ సినిమాను చూస్తూ ప్రేక్షకులు ఎలా ఎంజాయ్ చేస్తున్నారో థియేటర్లలో ప్రత్యక్షంగా చూశాను. ఇది నాకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. మలయాళ, తమిళ సినిమాకు పెద్ద తేడా లేదు. తమిళ సినిమా పెద్ద పరిశ్రమ. ఇక్కడ భారీ బడ్జెట్ చిత్రాలు తీస్తారు. హీరోయిన్ల ప్రతిభను గుర్తిస్తారు. నయనతార వంటి స్టార్ హీరోయిన్‌తో సహా అనేక మలయాళ హీరోయిన్లు ఇక్కడ రాణిస్తున్నారు. పైగా తమిళంలో హీరోయిన్ కావాలన్న చిరకాల కోరి నెరవేరింది. మంచి సినిమాల్లో, మంచి పాత్రల్లో నటించాలన్నదే నా కోరిక. అలాగే, తమిళ చిత్రపరిశ్రమలో ప్రధాన హీరోయిన్లలో ఒకరిగా ఎదగాలని కోరుకుంటున్నాను' అని చెప్పుకొచ్చారు.

నిర్మాతగా మారనున్న సూరి?



హాస్య నటుడు నుంచి హీరోగా మారిన సూరి ఇపుడు మరో కొత్త అవతారమెత్తనున్నారు. సొంతంగా చిత్రాన్ని నిర్మించనున్నారు. సూరి హీరోగా నటించిన చిత్రాలు వరుస విజయాలను సొంతం చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో పలువురు దర్శకులు ఆయనను కలిసి కథలు వినిపిస్తున్నారు. అలాగే, పలువురు నిర్మాతలు సైతం సూరి డేట్స్ కోసం వేచివున్నారు. ప్రస్తుతం 'మండాటి' సినిమాపై దృష్టికేంద్రీకరించిన సూరి.. త్వరలోనే నిర్మాతగా మారనున్నారు. అయితే, సొంతంగా చిత్రాలను నిర్మించకుండా, తాను నటించే తదుపరి చిత్రాలకు రెమ్యునరేషన్ తీసుకోకుండా, తద్వారా ఆయా చిత్రాల నిర్మాణంలో భాగస్వామిగా మారాలన్నది ఆయన ఆలోచన. సూరి ఆలోచనను అనేక మంది స్వాగతిస్తున్నారు. సో.. ఇకపై సూరి నటించే చిత్రాల్లో భాగస్వామిగా మారనున్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా వెయిలుకాంతమ్మ ఆవణి రథోత్సవం

చెన్నై,ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):తిరుచెందూరు వెయిలు కాంతమ్మ ఆవణి రథోత్సవం సోమవారం ఉదయం అత్యంత వైభవంగా జరిగింది. ఆ ఆలయంలో ఆవణి ఉత్సవాలు ఈ నెల 2న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ ఉయదం, సాయంత్రం అమ్మవారు వివిధ వాహనాల్లో ఊరేగారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం సోమవారం ఉదయం 6.30 గంటలకు ప్రారంభమైంది.అలంకరించిన రథంపై ఏర్పాటు చేసి న ప్రత్యేక ఆసనంపై అమ్మవారు ఆశీనులయ్యారు. ఆ తర్వాత భక్తులు రథానికి ఇరువైపులా ఉన్న మోకుతాళ్లను పట్టుకుని లాగుతూ నాలుగు ప్రధాన వీధులోల ఊరేగించారు. ఈ వేడుకలలో ఆలయ డిప్యూటీ కమిషనర్ జ్ఞానశేఖరన్, అసిస్టెంట్ కమిషనర్ నాగవేల్, తదితరులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు సదుపాయాలు కల్పించారు.

పొల్లాచ్చిలో కామరాజర్ సహా నలుగురి నేతల విగ్రహావిష్కరణ



పొల్లాచ్చి నీటివనరుల శాఖ కార్యాలయం వద్ద విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం స్టాలిన్, మంత్రులు, దివంగత నేతల కుటుంబీకులు

చెన్నై, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చి జలవనరుల శాఖ ప్రధాన కార్యాలయంవద్ద ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం కామరాజర్ సహా నలుగురు నేతల కాంస్య విగ్రహాలను ఆవిష్కరించారు. ఉడుమలపేటలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం స్టాలిన్ పొల్లాచ్చిలోని నీటి వనరుల శాఖ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ జరిగిన సభలో స్టాలిన్ పాల్గొని అక్కడి జల వనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ కార్యాలయానికి మాజీ మంత్రి దివంగత 'సీ సుబ్రమణ్యం ప్రాంగణం' అనే పేరుపెట్టారు. అదే సమయంలో పరంబికుళం ఆళియారు నీటిపారుదల పథకం ప్రారంభించేందుకు కృషిచేసిన మాజీ ముఖ్యమంత్రి కామరాజర్, మాజీ మంత్రి సి.సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యే వీకే పళనిస్వామి, పొల్లాచ్చి ఎన్.మహాలింగం కాంస్య విగ్రహాలను సీఎం ఆవిష్కరించారు. ఆ ప్రాంగణంలోనే రూ.4.29 కోట్లతో నిర్మించిన వీకే పళనిసామి హాలు, ఆళియారు ఉద్యానవనంలో పరంబికుళం ఆళియారు నీటిపారుదల ప్రాజెక్టు నిర్మాణ సమయంలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయినవారి కోసం రూ.2.83 కోట్ల తో నిర్మించిన స్మారక మండపాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్.ముత్తుసామి, ఎ.చక్రపాణి, ఎన్.కయల్‌విళి సెల్వరాజ్, మాజీ మంత్రి కన్నప్పన్, తమిళభాషాభివృద్ధి సమాచార శాఖ కార్యదర్శి వి. రాజారామన్, నీటివనరుల శాఖ కార్యదర్శి జే జయకాంత్, సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు డాక్టర్ ఇరా వైద్యనాథన్, కోయంబత్తూరు జిల్లా కలెక్టర్ పవన్‌కుమార్ జి. గిరయప్పనవర్, దివంగత నేతల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం కోసం

● తొలి ఏఐ ఆధారిత హెల్ప్‌లైన్ ప్రారంభం



హెల్ప్‌లైన్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ వెంకటేష్ మునికృష్ణన్

చెన్నై, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 'అస్సానా' కొలెరెక్టల్ అండ్ వెల్‌నెస్ క్లినిక్ దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత ఆరోగ్య హెల్ప్‌లైన్ సెంటర్ ప్రారంభించింది. అస్సానా వ్యవస్థాపకులు డాక్టర్ వెంకటేష్ మునికృష్ణన్ ఇటీవల దీనిని లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మలబద్ధకం, మూలాలు, మలరక్తస్రావం, ఉబ్బరం వంటి సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులకు ఎలాంటి గందరగోళం లేకుండా ఈ ఏఐ ఆధారిత హెల్ప్‌లైన్ సహాయపడుతుందని వివరించారు. దేశంలోని ప్రతి ముగ్గురిలో ఒకరు పేగు లేదా పెద్ద ప్రేగు సమస్యతో బాధపడుతున్నారని, దాని గురించి వారు మాట్లాడడానికి సిగ్గుపడుతుంటారన్నారు. అలాంటివారు తమ హెల్ప్‌లైన్‌ను సంప్రదిస్తే సహాయం అందుతుందని వివరించారు.

16 నుంచి ఈషా గ్రామోత్సవ పోటీలు



గ్రామోత్సవ లోగో విడుదల చేస్తున్న జగ్గీ వాసుదేవ్

ప్యారీస్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువతను క్రీడల్లో ప్రోత్సహించేలా కోవై, నీలగిరి, తిరుప్పూర్ జిల్లాల్లో ఈ నెల 16 నుంచి గ్రామోత్సవం పేరిట పోటీలు నిర్వహించి, విజేతలకు రూ.67 లక్షల విలువ బహుమతులు అందజేయనున్నట్లు ఈషా యోగా ధ్యాన కేంద్రం అధిపతి సద్గురు జగ్గీ వాసుదేవ్ తెలిపారు. సోమవారం గ్రామోత్సవం పోటీల లోగోను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమ కేంద్రం ఆధ్వర్యంలో 17వ సారిగా ఈ నెల 16 నుంచి నిర్వహించదలచిన పోటీల్లో 30వేలకు పైగా గ్రామాల నుంచి 50వేల మందికి పైగా యువతీ, యువకులు పాల్గొంటారని తెలిపారు. భారతీయ సంప్రదాయానికి అద్దం పట్టేలా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా, మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన యువతను, ఆ అలవాట్ల నుంచి విడిపించేందుకు, కులవివక్ష రూపుమాపేందుకు, మహిళల్లో ధైర్యసాహసాలు నింపేలా ఈ పోటీలు ఉంటాయని సద్గురు తెలిపారు.

నంగనల్లూర్ ఆంజనేయస్వామికి స్వర్ణ రథం

● 9.5 కిలోల బంగారం అందజేసిన మంత్రులు



ఆలయ నిర్వాహకులకు బంగారం కడ్డీలు అప్పగిస్తున్న మంత్రులు

ప్యారీస్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక నంగనల్లూర్‌లో ప్రసిద్ధిచెందిన ఆంజనేయస్వామి ఆలయానికి నూతన స్వర్ణ రథం తయారీకి రాష్ట్ర ప్రభుత్వం తరపున 9.5 కిలోల బంగారాన్ని మంత్రులు టీఎం అన్బరసన్, పీకే శేఖర్‌బాబు సోమవారం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులు మీడియాతో మాట్లాడుతూ... నంగనల్లూర్ ఆంజనేయస్వామి ఆలయానికి నూతనంగా రూ.8 కోట్లతో బంగారు రథం నిర్మించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. భక్తులు, దాతల సహకారంతో స్వర్ణ రథం తయారవుతుందని మంత్రులు తెలిపారు.

పుదువైలో తాత్కాలికంగా 13 రెస్టో బార్ల లైసెన్స్ రద్దు



పుదుచ్చేరిలోని రెస్టో బార్లు

పుదుచ్చేరి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో ప్రభుత్వం నిర్ణయించిన సమయం దాటి పనిచేసిన 13 రెస్టో బార్ల లైసెన్స్ ఎక్సైజ్ శాఖ తాత్కాలికంగా రద్దు చేసింది. పుదుచ్చేరిలో ఆధునిక వసతులతో కూడిన మద్యం బార్లు సుమారు 400లకు పైగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో, కొత్తగా మ్యూజిక్, డాన్స్ తదితర కార్యక్రమాలతో పాటు మద్యం సేవించేందుకు అనుకూలంగా రెస్టో బార్లు అందుబాటులోకి వచ్చాయి. ఈ బార్లు అర్ధరాత్రి 12 గంటల వరకు పనిచేసేలా ఎక్సైజ్ శాఖ లైసెన్స్ ఇచ్చింది. అయితే, వారాంతపు సెలవు రోజుల్లో ఈ బార్లు నిబంధనలు అతిక్రమించి నడుస్తున్నట్లు ఫిర్యాదులు న్నాయి. ఇదిలా ఉండగా, మిషన్ వీధిలో ఉన్న రెస్టో బార్లో ఇటీవల పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న చెన్నైకి చెందిన విద్యార్థి హత్యకు గురైన విషయం తెలిసిందే. దీంతో, పుదుచ్చేరి ఎక్సైజ్ విభాగం తహసీల్దార్ రాజేష్‌ఖన్నా నేతృత్వంలో నగర ప్రాంతంలో ఉన్న రెస్టో బార్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వీటిలో అర్ధరాత్రి 12 గంటలు దాటినా పనిచేసిన 13 బార్ల లైసెన్స్ బార్ల లైసెన్స్ తాత్కాలికంగా రద్దు చేస్తూ ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది.



పంద్రాగస్టు రెండో విడత రిహార్సల్స్

పెరంబూర్,ఆగస్టు11(ఆంధ్రజ్యోతి):స్వాతంత్ర్య దినోత్సవ రిహార్సల్స్‌లో భాగంగా మెరీనా బీచ్ సమీపంలోని సచివాలయం ముందు సోమవారం నిర్వహించిన రెండో విడత ముందస్తు కవాతు వీక్షించేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జార్జి కోట మైదానంలో ముఖ్యమంత్రి స్టాలిన్ జాతీయ పతాకం ఎగురవేయనున్నారు. ఈ సందర్భంగా త్రిదళాలు, పోలీసు, అగ్నిమాపక, జైళ్ల శాఖల సిబ్బంది కవాతు ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శన రెండో విడత రిహార్సల్స్ సోమవారం ఉదయం జరిగాయి. రిహార్సల్స్ వీక్షించేందుకు తెల్లవారుజాము నుంచే ప్రజలు కామరాజర్ రోడ్డుకు చేరుకున్నారు. రిహార్సల్స్ సందర్భంగా కామరాజర్ రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ మార్పులు చేపట్టారు. మూడవ విడత రిహార్సల్స్ ఈ నెల 13వ తేది బుధవారం జరుగనున్నాయి.







సీఎం స్టాలిన్‌తో మహారాష్ట్ర గవర్నర్ భేటీ ...



చెన్నైలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్



పెరుంబాక్కం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎంపీ పి. విల్సన్ నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుండి కేటాయించిన రూ.3 కోట్లతో నిర్మించిన కలైంజర్ అరంగం (హాలు)ను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

తుడా పరిపాలనాధికారిగా శైలజ


తిరుపతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ పరిపాలనాధికారిగా డాక్టర్ ఎస్.శైలజ నియమితులయ్యారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లా యాదమరిలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్న ఆమెను ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ నుంచి డెప్యుటేషన్‌పై మున్సిపల్ పాలనా శాఖకు బదిలీ చేస్తూ తుడా పరిపాలనాధికారిగా నియమించింది. సంబంధిత పోస్టులో ఆమె ప్రాథమికంగా ఏడాది పాటు కొనసాగనున్నారు. మున్సిపల్ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

తిరుమలలో 16న గోకులాష్టమి ఆస్థానం

● మరుసటి రోజు ఉట్లోత్సవం

తిరుమల, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వరస్వామిని సాక్షాత్తు ద్వాపరయుగపురుషుడైన శ్రీకృష్ణుడిగా స్మరించుకుని ఈనెల 16వ తేదీన శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా తిరుమలలో గోకులాష్టమి ఆస్థానం నిర్వహించనున్నారు. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి ముఖ మండపంలో రాత్రి 8 నుంచి 10 గంటల వరకు గోకులాష్టమి ఆస్థానం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా బంగారు సర్వభూపాల వాహనంపై శ్రీకృష్ణస్వామిని వేంచేపు చేసి నివేదినలు సమర్పిస్తారు. ఉగ్రశ్రీనివాస మూర్తికి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు, కృష్ణ స్వామికి ఏకాంతంగా తిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం ద్వాదశారాధనం చేపడతారు. 17వ తేదీన తిరుమలలో ఉట్లోత్సవాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు ఈ ఉత్సవాన్ని తిలకించడానికి మలయప్పస్వామి బంగారు తిరుచ్చిపై, శ్రీకృష్ణస్వామి మరో తిరుచ్చిపై తిరుమాడవీధుల్లో విహరిస్తారు. ఆలయం ముందు యువకులు ఎంతో ఉత్సాహంతో పాల్గొని ఉట్లను కొడతారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని 17వ తేదీన శ్రీవారి ఆలయంలో నిర్వహించే ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.73 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 82,628

తలనీలాలు సమర్పించినవారు: 30,505

గజరాజుకు రక్షణ ఏదీ?

● అంతరిస్తున్న అడవులతో ఆవాసాలకు దూరం

● నేడు ఏనుగుల దినోత్సవం




ఏనుగు బతికినా పదివేలే.. చనిపోయినా పదివేలే అంటారు. బతికితే గజరాజులా బతకాలని కూడా చెబుతారు. ఎందుకంటే ఏనుగు తెలివైన జంతువే కాదు. స్వేచ్ఛా జీవి కూడా.. సమూహంగా ఉంటూ నాయకత్వం చాటుకుంటుంది. కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న తోటి ఏనుగును ఇట్టే గుర్తు పడుతుంది. ప్రయాణించిన మార్గాన్ని ఎప్పటికీ మర్చిపోదు.. పిల్లలతో ఉన్నపుడు దాని దగ్గరకు వెళ్లాలంటే పులులు, సింహాలే వెనుకడుగేస్తాయి...ఇన్ని విశిష్ట లక్షణాలున్నఏనుగు ఆవాసానికి క్రమేపీ చోటు కరువవుతోంది. ఏనుగుల దినోత్సవం(మంగళవారం) సందర్భంగా ప్రత్యేక కథనం.

- మంగళం, ఆంధ్రజ్యోతి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని శేషాచల కొండల్లో వందకుపైగా ఏనుగులు ఉన్నట్లు ఫారెస్ట్ అధికారుల అంచనా. గత పదేళ్లలో తిరుపతి పరిసర అటవీప్రాంతాల్లో ప్రమాదవశాత్తూ నాలుగు చనిపోయాయి. కొన్నాళ్లుగా ఇక్కడి అటవీప్రాంతంలో ఆవాసానికి అనువైన పరిస్థితులు కొరవడుతున్నాయి. అడవులను నరికివేయడం, ఆక్రమించి వ్యవసాయం చేయడం, కొన్నిచోట్ల ఎర్రచందనం కోసం స్మగ్లర్లు అలజడి సృష్టించడం లాంటి కారణాలతో ఏనుగులు బయటకు వస్తున్నాయి. సమీపంలో నీరు,ఆహారం కోసం దాడులు చేస్తున్నాయి. పంటపొలాలను ధ్వంసం చేస్తున్నాయి. రైతులను నష్టపరుస్తున్నాయి. కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వీటిని తిరిగి అరణ్యమార్గం పట్టించడం అధికారులకు సవాలుగా మారుతోంది. ఈనేపథ్యంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంది. కర్ణాటక నుంచి నాలుగు కుంకీ ఏనుగులను రప్పించింది. వీటి నిర్వహణపై ఇక్కడి సిబ్బందికి శిక్షణ కూడా ఇప్పించింది. పలమనేరు మండలంలో ప్రస్తుతం ఈ కుంకీలు తమ పనిని ప్రారంభించాయి. గుంపులుగా ఉన్న ఏనుగులను ఒడుపుగా అడవిలోని పంపేందుకు శ్రమిస్తున్నాయి..

ప్రత్యేక టాస్క్‌ఫోర్సు

ఏనుగుల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్సును కూడా ఏర్పాటు చేసింది. ఇందులోఎఫ్‌ఆర్వో డీఎఫ్‌వో పర్యవేక్షణలో పదిమంది సిబ్బంది, ఇద్దరు పరిశోధకులు, పనిచేస్తున్నారు. ఉనికి గుర్తించేందుకు జీపీఎస్, డ్రోన్లు, ట్రాప్ కెమెరాలు ఉపయోగిస్తున్నారు. వాటి ఆవాసాలను సంరక్షించడం, అడవుల్లో నీటితొట్టెలు ఏర్పాటుచేయడం, పంట పొలాలకు వచ్చినపుడు సురక్షితంగా తిరిగి మళ్లించడంలాంటి చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల జాతీయ కమిటీ పర్యటించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించింది. కారిడార్ల ద్వారా ప్రత్యేక రక్షణ కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు.



కీరమంద ప్రాంతానికి కుంకీలను తరలిస్తున్న మావటీలు

జూపార్కులోనూ ఉన్నాయోచ్

తిరుపతి ఎస్వీ జూపార్కులో ఐదు ఏనుగులను సంరక్షిస్తున్నారు. వీటిలో 3మగవి, రెండు ఆడవి. వీటికి రోజుకు రూ.2,350, వారానికి రూ.16,450, నెలకు రూ.70,500 ఖర్చు చేస్తున్నారు. వీటి సంరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలంటే దత్తత తీసుకునే అవకాశం ఉందని జూ అధికారులు చెబుతున్నారు.



నక్కలవారికండ్రిగ పేదలు సాగు చేసుకుంటున్న భూములను పరిశీలిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

పేదలు సాగుచేసుకుంటున్న భూములను వారికే పంపిణీ చేయాలి

● సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

చిల్లకూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నిరుపేద దళితులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ మిగులు భూములను పేదలకే పంపిణీ చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. సోమవారం మండలంలోని నక్కలకాలవ కండ్రిగ వద్ద నిరుపేద దళితులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములను ఆయన స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ నెలబల్లిరెట్టపల్లి పంచాయతీలోని నక్కలకాలువ కండ్రిగ వద్ద ఉన్న సుమారు 45 ఎకరాల ప్రభుత్వ భూములను 22 ఏళ్లుగా దళితులు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రస్తుతం కొందరు టీడీపీ నాయకులు నిరుపేదలపై అక్రమ కేసులు పెడుతూ భూములను అక్రమించుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారని ఆరోపించారు. ఆ భూములను పేదలకు కేటాయించే వరకు సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, శశికుమార్, సీవీఆర్ కుమార్, నారాయణ, రమేష్, సునీల్, శ్రీనివాసమూర్తి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మా ఊర్లోనే పాఠశాల ఉండాలి

● తడ దళితవాడ విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో మల్లికార్జునరావు

తడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తమ ఊర్లోనే పాఠశాలను కొనసాగించాలని తడ దళితవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. సోమవారం పాఠశాలను మూసివేసి అక్కడే ధర్నా చేపట్టారు. ఎంఈవో మల్లికార్జున్ పాఠశాల వద్దకు చేరుకొని తల్లిదండ్రులతో చర్చించారు. గ్రామస్తులు సమస్యను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దృష్టికి తీసుకువెళ్లారు. మా ఊర్లోనే పాఠశాలను కొనసాగించేలా చూడాలని వేడుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే డీఈవో కుమార్‌తో చర్చించారు. ఇందుకు ఆయన సానుకులంగా స్పందించారు. తడ దళితవాడ ప్రాథమిక పాఠశాల 5వ తరగతి వరకు చదువుకునేలా విద్యాశాఖ అధికారులు అంగీకరించినట్లు తమకు హామీ లభించిందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఈ విషయమై ఇంత వరకు తగిన ఆదేశాలు రాలేదని, ఉన్నతాధికారుల సూచన ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో మల్లికార్జున్ చెప్పారు.

భానుప్రకాష్‌రెడ్డికి పలువురి పరామర్శ



భానుప్రకాష్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

తిరుపతి (ఉపాధ్యాయనగర్), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నేత భానుప్రకాష్‌రెడ్డిని పలువురు ప్రముఖులు పరామర్శించారు. ఆయన తల్లి గుడుపల్లి అరుణమ్మ (80) ఆదివారం మృతిచెందిన విషయం విదితమే. సోమవారం పలువురు ప్రముఖులు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. భానుప్రకాష్‌రెడ్డి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఇందులో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, తిరుపతి, చంద్రగిరి, నగరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, మురళి, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రహ్మణ్యం, బత్తల చెంగల్రాయులు, తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఏపీ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, డీఆర్‌డీఏ ఛైర్మన్ సతీష్‌రెడ్డి, ఏపీ గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ సుగుణమ్మ, శాప్ ఛైర్మన్ రవినాయుడు, టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరి, జేఈవో వీరబ్రహ్మం. డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్రనారాయణ, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ చరణ్ తేజ్, టీడీపీ నేతలు భువన్‌కుమార్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి తదితరులు ఉన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు గోవిందధామంలో దహనక్రియలు నిర్వహించారు.

ఆర్‌ఎంపీ క్లినిక్ సీజ్

డక్కిలి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డక్కిలిలో ప్రభుత్వాస్పత్రి ఎదురుగా నడుపుతున్న ఆర్‌ఎంపీ క్లినిక్‌ను సోమవారం అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారిణి బిందుప్రియ మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రికి వంద మీటర్ల దూరం వరకు ఎలాంటి ప్రైవేట్ వైద్యశాలలు ఉండకూడదన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఏప్రిల్‌లోనే ఆర్‌ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేశామన్నారు. అయితే హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు కావడంతో తరుపరి చర్యలు తీసుకోలేదన్నారు. హైకోర్టు ఆ కేసు కొట్టివేయడంతో ఈనెల 7న క్లినిక్ నిర్వాహకులకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. గడవు ముగిసినా నిబంధనలు పాటించకపోవడంతో సోమవారం క్లినిక్‌ను మూసివేయించినట్లు వివరించారు. కార్యక్రమంలో వెంకటగిరి సీఐ రమణ, డక్కిలి, బాలాయపల్లి ఎస్‌ఐలు శివశంకర్, కామినేని గోపి, వైద్యాధికారి శ్రీహరి, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నరాణి తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌ఎంపీ క్లినిక్ వద్ద అధికారులు





ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్ - పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన ప్రజలు

శ్రీకాళహస్తిలో ప్రత్యేక పీజీఆర్‌ఎస్

హాజరైన కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే సుధీర్ ● 1,500పైగా వచ్చిన అర్జీలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకోసం ప్రత్యేకంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో 1,500మందికి పైగా ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు ఇచ్చారు. ఆయా మండలాలకు సంబంధించి వేర్వేరుగా అధికార యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే సుధీర్, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి పీజీఆర్‌ఎస్ ఉద్దేశాన్ని ప్రజలకు వివరించారు. అనంతరం ఫిర్యాదులను స్వీకరించారు. అక్కడికక్కడే ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సుమారు 2వేలమందికి పైగా సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. అందులో 90శాతం రెవెన్యూ సమస్యలే ఉన్నాయన్నారు. చాలామంది కలెక్టరేట్‌కు వెళ్లలేని పరిస్థితి ఉండటంతో తన విజ్ఞప్తికి ఆయన సానుకూలంగా స్పందించి ప్రత్యేక గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేశారన్నారు. ప్రతి మూడు నెలలకోసారి ఇదే తరహాలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని కలెక్టర్‌ను కోరారు. చెంబేడు కాలువను శుభ్రం చేసేందుకు ప్రభుత్వం తరపున కలెక్టర్ సహకరించాలని కోరారు. రేణిగుంట, ఏర్పేడు మండలాల నుంచి భూ సమస్యలు రాష్ట్రస్థాయిలోనే అత్యధికంగా నమోదవుతున్నాయని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఈ పరిస్థితుల దృష్ట్యా శ్రీకాళహస్తిలోనే ప్రత్యేకంగా గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేశామన్నాదు. సెప్టెంబరు చివరి వారంలో మళ్లీ ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు. విడతల వారీగా అన్ని సమస్యలు పరిష్కారమయ్యే వరకు గ్రీవెన్స్‌ను కొనసాగిస్తామన్నారు. డీఎస్పీ నరసింహమూర్తి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ భరత్‌రెడ్డి, శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్, నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, విద్యుత్, ఇరిగేషన్, హౌసింగ్, కార్మిక, పశుసంవర్ధక శాఖల అధికారులు పాల్గొన్నారు.





జలపాతాల కొండ

ఉండి ఉండీ దంచిపోస్తున్న వానలకు తిరుమల కొండల్లో జలపాతాలు ఉరికి దూకుతున్నాయి. ఆదివారం రాత్రి నుంచే కపిలతీర్థం ఉధృతంగా ప్రవహిస్తుండగా, సోమవారం ఉదయానికి మాలాడగుండం కూడా జాలువారుతోంది. గరుడవారధి మీద తిరుమలకు ప్రయాణించే వాహనాల్లోని యాత్రీకులకు ఈ జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. కపిలతీర్థంకి జనం పోటెత్తి వస్తున్నారు. ఇక్కడ నిలిపేస్తున్న వాహనాలతో నంది సర్కిల్‌లో ట్రాఫిక్‌కి తీవ్ర అంతరాయం కలుగుతోంది. దివ్యారామం కొలను ముందు ప్రకృతి ప్రేమికులు పెద్ద సంఖ్యలో కనిపిస్తున్నారు. ఫొటోలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు.





